## అమూల్య ★

పెద్ద హాలు. హాలునిండా ఆడవాళ్ళు. హాలుకి మధ్యగా రంగు రంగు దీపాలతో పూలగుత్తి అమర్చబడ్డ తోరణం. ఆ తోరణంనుంచి ప్రసరిస్తున్న రంగు రంగుల కాంతులు హాలుని ఇంద్ర ధనస్సులో వున్నట్లు చూపుతున్నాయి. హాలునిండా వరసల ప్రకారం అమర్చివేసిన కుర్చీలు, వాటికి దూరంగా కుడివైపు గోడవారగా కొన్ని బెంచీలు కలిపివేసి వాటిమీద తివాసీలు పరిచి తాత్కాలికంగా యేర్పరచిన చిన్న స్టేజీ. ఆ స్టేజీమీద ప్రపంచం అంతా ముంచుకుపోయినట్లు మొహం ముడుచుకుని కూర్చున్న ఓ పసి మొహం. స్టేజీమీద, హాలులో హడావుడిగా అటూ యిటూ తిరుగుతున్న ఆడవాళ్ళల్లో ఆ చిన్నపాపని యెవరూ పట్టించుకున్నట్లు లేరు. చాలామంది వరసగా వేసిన కుర్చీలని వదిలేసి చిన్న చిన్న గుంపులుగా చేరి ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇద్దరు, ముగ్గురు ఆంగ్లోయిండియన్స్ కాబోలు, భుజాలు లేని గౌన్లతో ఓ ప్రక్కగా కుర్చీలో కూర్చుని వచ్చేపోయేవారిని, హాలుని, స్టేజీమీదున్న పాపని కలియచూస్తున్నారు. కొంతమంది ఫలహారాలువాటికి కాబోలు యెడం వైపుగా వున్నగది గుమ్మంలోనుంచి లోపలకు వెళ్ళి తిరిగివస్తున్నారు. ఆ తిరిగి వస్తున్నవారికి గుమ్మందగ్గర రక్షకభటుల్లా నిటారుగా నిలబడ్డ ఇద్దరు పొడుగాటి, సన్నటి అమ్మాయిలు

కిళ్ళీలు, ఏవో పేపరు పొట్లాలు అందిస్తున్నారు. అంతా ఆడ వాళ్ళే! ఒక్క మగపురుగు లేదు. కొంతమంది చిన్న పిల్లల్ని తప్పిస్తే మొత్తానికి హైద్రాబాదులో అన్నిరకాల జాతులకు, కోవలకు చెందిన ఆడవాళ్ళందరూ దాదాపుగా యిక్కడ కన్పిస్తూనే వున్నారు. ఇంతమంది ఆడవాళ్ళని ఒక్కచోట తన ఇరవై యేళ్ళ జీవితంలో ప్రప్రథమంగా చూస్తున్న వాసంతి ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసుకొని చూస్తోంది. ఒక్క తలలే చూస్తే యెన్నిరకాలో! తట్టంత చుట్టలు చుట్టి వాటిమీద బుట్టెడుపూలు పెట్టినవాళ్ళు కొంతమంది. అయితే, కొంత మంది అసలే జడే వేసుకోనట్లు భుజాల సగంభాగందాకా వది లేసి అక్కడ్నుంచి రెండల్లులు అల్లినట్లున్నారు. ఇంకా కొంత మంది పీచుల్లావున్న రెండు జడలు వేసుకున్నారు.

కొంతమంది చక్కగా పొడుగాటి జడలువేసుకుని వాటి పైన నాగరం, చంద్రవంకలాటివి పెట్టుకుని చివర కుప్పెలు వేసుకున్నారు. ఇంకా కొంతమంది నడినెత్తిమీదికి రిబ్బన్, పువ్వులా వచ్చేట్లు అదేదో అజంతా బొమ్మల్లా ముడేసు కున్నారు. జుట్టుని ఎన్నిరకాల అలంకరించుకోవచ్చో వాసం తికి తెలిసిపోయింది. ఒక్క జుట్టేగాదు. బట్టలు, బొట్టు, గాజులు యెంత నాజూకుగా, యెంత సహజంగా అలంకరించుకోవచ్చో వాసంతికి మొదటిసారిగా అర్థమైంది. జుట్టు, కట్టు, బొట్టు—ఈ మూడింటికోసం ఆడవాళ్ళు ఎన్నిరకాలు కావాలనుకుంటారో, ఎంత తాపత్రయ పడ్తారో అన్పిస్తుంది వీళ్ళని చూస్తూంటే. ఎంత యినా పుట్టినరోజు పేరుతో యింత హడావుడా! చిన్న పెళ్ళి చేసినంత. పుట్టినరోజే యింత వైభవంగా చేస్తూంటే యిహ

పెళ్ళికి యెంత హడావుడి పడ్డారో! బందరు దగ్గర ఓ పక్కా పల్లెటూరులో పుట్టిన వాసంతికి యిదంతా కొంచెం విచిత్రంగానే వుంది. స్టేజీమీదవున్న పాపకి అందరూ యేవో బహుమతులు తీసుకెళ్ళి యిస్తున్నారు. ఆ పాపకి పక్కగా, వంటినిండా ధగధగమెరిసే రాళ్ళ నెక్లెస్‌తో, పట్టెడు వెడల్పుగల జరీఅంచు పట్టుచీరతో గట్టిగా బిగించినట్లున్న ఓ స్థూలపాటి వయసు మళ్ళిన సువాసిని బహుమతులు తెస్తున్నవాళ్ళని వాడి చూపులు చూస్తూ నఖశిఖపర్యంతం పరిశీలిస్తోంది. ఆవిడ ప్రక్కగా నిలబడ్డ ఓ ఖద్దరుచీర ఆవిడ తెచ్చిన వాళ్ళు యిచ్చిన బహుమతులన్నీ జాగ్రత్తగా ఓ ప్రక్కగా పెడ్తోంది. ఆలస్యంగావచ్చి, హాలులోవున్న ఆడవాళ్ళనిచూసి అలాగే గుమ్మందగ్గర నిలబడిపోయిన వాసంతి చేతిలోవున్న వెండి సోప్‌బాక్సు ఒకసారి తడిమి చూసుకుంది. ఎలా యీ మహాసముద్రంలో ప్రవేశించి డాక్టరుగారి భార్య సుకన్యాదేవి యెక్కడుందో వెతికిపట్టుకోవటం? అసలిలా నలుగురిలోకి రావటం అంటేనే వాసంతికి భయం! ఏదో వ్యక్తిత్వం పోగొట్టుకున్నట్లు, తనకేం లేనట్లు జాలిగా, దీనంగా అన్పిస్తుంది. అందులోనూ యిలా వంటరిగా ప్రక్కన శేఖరం లేకుండా రావటం వాసంతికి యిదే మొదటిసారి. అతను ప్రక్కనేవుంటే ఫర్వాలేదు. తనవి, అతనివి అన్నిజవాబులూ అతనే చెప్తూవుంటాడు. తనుమటుకు అన్నిటికీ సమాధానంగా చిన్నగానవ్వుతూ వుంటుంది. అందుకే అసలు యిక్కడికి గూడా వెళ్ళనంటే కాదు కూడదు, వెళ్ళితీరాలి అన్నాడు. రెండు రోజులక్రితం క్యాంప్ వెళ్తూ జీప్‌లోకూర్చుని బైలుదేరబోతూ కూడా మరో

సారి డాక్టరింటికి పుట్టిన రోజుకి తప్పకుండా వెళ్ళిరమ్మన మని హెచ్చరించాడు. అక్కడికి తను చాలా ఆలస్యంగానే వచ్చింది. ఇప్పటికి చాలా హడావుడి తగ్గిపోయి వుంటుంది, సుకన్యాదేవి వెంటనే కన్పిస్తుందేమోనని. అయినా అసలు యింతమంది వస్తారని తనకేం తెలుసు? లోపలికి వెళ్ళాలంటే యేదో భయం వేస్తోంది. యెలా—ఏవో ఆలోచనలతో పరధ్యాసగా నిలబడ్డ వాసంతి "అదేమిటి అలా గుమ్మందగ్గర నిలబడిపోయావేం? లోపలికిరా, రా! యెంతసేపయింది వచ్చి? శేఖరం క్యాంప్ నుంచి రాలేదూ?" అంటూ సుకన్యాదేవి భుజంతట్టి పలక రించటంతో వులిక్కిపడింది. ఆ వెంటనే తన్ని తను తమా యించుకుంటూ "అబ్బే లేదండీ! యిప్పుడే వచ్చాను. మీ కోసమే చూస్తున్నాను" అంది చప్పున కళ్ళు చేతిలోవున్న సోప్ బాక్సుమీద వాల్చుకుంటూ. 'ఛీ, ఛీ—యిలా గుమ్మం దగ్గర నిలబడి వుండకూడదు. కాస్తంత ధైర్యం చేసుకుని లోపలికివెళ్ళి కూర్చుంటే బాగుండేది' అనుకుంటూ "మంచి దానివే! నయం, నే వెంటనే చూశాను కాబట్టి సరిపోయింది. అసలు చూడకనేపోదును. మా అక్కయ్య కూతురువచ్చి గుమ్మందగ్గర పాలరాతి బొమ్మలా నిలబడ్డ ఆ అమ్మాయి 'ఎవరు పిన్నీ' అంటే తిరిగి చూశాను. సుకన్యాదేవి నవ్వుతూ వాసంతిని చేయిపట్టి తీసుకొచ్చి ముందువరసలో వున్న ఓ కుర్చీలో కూర్చొబెట్టింది. ఆవిడింక ఏదో చెప్తూండగా 'వెళు తున్నానండీ' అంటూ ఎవరో రావటంవల్ల వాసంతిని'కూర్చో వస్తానని వెళ్ళిపోయింది.

క్షణంలో వచ్చిన వ్యక్తిత్వం మళ్ళీ పోయినట్లనిపించింది వాసంతికి. ఎవరూ మాట్లాడేవాళ్ళు లేరు. పై పెచ్చు దూరంగా కూర్చున్న యిద్దరు ముగ్గురు నైలాన్‌చీర లమ్మాయిలు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వాసంతిని తిరిగి తిరిగి చూసి వాళ్ళలో వాళ్ళు ఏమిటో చెప్పుకుంటున్నారు. వాళ్ళు చెప్పుకునేదేమిటో వాసంతికి వినిపించటం లేదు. ఒకవేళ తనిలా కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తోందని 'వెర్రిమొహంలా వుంది, తెలుస్తూనేవుంది' అనుకుంటున్నారేమో! వాసంతి కళ్ళు వాల్చుకుని చీరెవంక చూసుకుంది. తెల్లటి పాలనురుగులాటి చీరె. ఈ చీరెంటే శేఖరానికి చాలా యిష్టం. శేఖరం గుర్తుకొచ్చేసరికి వాసంతి మొహంలో భయం, బెరుకుదనంపోయి వుల్లాసం వచ్చింది. 'క్యాంప్‌లో ఈ పాటికి ఏంచేస్తున్నాడో! ఆఫీసులో అతను చాలా గంభీరంగా వుంటాడని. అందరూ భయపడ్తారని మళ్ళీ ఎవర్నీ ఏమీ అనడని చెప్తాడు రాజు.

ఎక్కడి తను! ఎక్కడ శేఖరం! అదృష్టం అంటే యిదే కాబోలు. 'మీ ఆయనంటే సామాన్యం కాదమ్మాయోయి! పెళ్ళికాని ఆడపిల్లల గుండెల్లో మెరుపు. పెళ్ళయిన ఆడపిల్లల గుండెల్లో నిట్టూర్పు' శేఖరంతో తనపెళ్ళి స్థిరపడిం తర్వాత తనని పెళ్ళికూతుర్ని చేసినప్పుడు కొత్తబట్టలతో ఆశీర్వాదంకోసం నమస్కరించటానికి వెళ్ళినప్పుడు అన్న మామయ్య మాటలు తనెలా మర్చిపోతుంది! అప్పుడే అక్కడే నిలబడ్డ అక్కయ్య 'యిహ అందరి గుండెల్లోనూ నిట్టూర్పే మామయ్యా! ఒక్క వాసంతి మొహంలోనే మెరుపు అతను' అన్నది. ఆ రోజు అవేవో తమాషా మాటలనుకుంది. కాని యెంత నిజం! కాని

చిత్రం! అన్నివిధాలావున్న, అతను తనలో ఏం చూశాడో! చూసేందుకు ఏముంది? అదృష్టం దయతలచి తన ప్రక్కన నిల బడింది అంతే— యివే మాటలు తను ఓసారి అంటే అతను 'లేదు వాసంతీ! నీలో నేను చాలా చూశాను. ఏంచూశానో చెప్పమని అడగకు. ఒకప్పుడు నాలోవుండి ప్రస్తుతం పోగొట్టు కున్నదంతా నీలో చూశాను' అన్నాడు. తన కా రోజు, ఆ క్షణం చాలా బాగా గుర్తుంది. ఆరోజు ఆదివారం. రాజేంద్ర నగర్‌లో కిద్వాయి గార్డెన్ కాటేజ్ రిజర్వ్ చేయించు కున్నారు. యెప్పుడోగాని శేఖరానికి అంత తీరిక దొరకదు. ఆ రాత్రి యెంత బాగుంది! కాటేజ్ ప్రక్కనున్న పచ్చగడ్డి మంచుతో తడిసి కొద్దిగా చల్లగా వుంది. తెల్లటివెన్నెల, స్వచ్ఛమైన మనసులా— చుట్టుప్రక్కల శబ్దమే లేదు. కొంచెం దూరంలోవున్న చెవులపిల్లుల గుస గుస తప్ప. కాటేజ్ మధ్యగా శబ్దంచేస్తూ దొర్లేనీళ్ళు, వెన్నెట్లో, పచ్చగడ్డిమీద శేఖరం జేబురుమాలు వేసుకుని కూర్చున్న తను, తన ఒళ్లో శేఖరం తల. యెన్ని యుగాల అనుభవం కలిగింది తనకి! అలా ఎన్నికోట్ల సంవత్సరాలు బ్రతికితేమటుకు విసు గొస్తుందా ? కాలం నిల్చిపోతే బాగుండు ననిపిస్తుంది. ఎలా నిలుస్తుంది కాలం! తనకు చాతనైతే సూర్యుడ్ని, చంద్రుడ్ని యే లోయలమధ్యకైనా విసిరేసేది. అవును, వాటి నుంచేగా యీ రాత్రింబవళ్ళు. అవి చెయ్యలేని తను శేఖరం చేతి గడియారంతీసి దూరంగా దాచేసింది. అతన్ని గురించి తను యింతగా ఆలోచిస్తున్న యీ క్షణంలో అతనేం చేస్తుం

టాడు? ఎందుకోమరి! తను వున్నప్పుడు ఓ విధంగా, లేనప్పుడు యింకో విధంగా వుంటాడు. బహుశా గంభీరంగా వుండటం అలవాటయిపోవటమే కారణం కావచ్చు. రేపు సాయంత్రం గాని రాడు క్యాంప్‌నుంచి. రేపుసాయంత్రం ఎప్పటికి రాను? మళ్ళీ గడియారంమీద కోపం! తన యీ ఆలోచనలన్నీ శేఖరంకి తమాషా! చెప్పించుకుని చెప్పించుకుని నవ్వుతాడు. అతనికి తెలియదుగా—అతనికోసం ఓ మంచివార్త వుందని. పాపం! అన్నం సరిగ్గా సయించకపోతే వాంతులు చేసు కుంటూంటే ఎంత ఖంగారుపడ్డాడో! అసలు ప్రతి విషయం, ప్రతిమాటా అతను విలువ చేకూరుస్తాడా లేక, తను వూహించు కుంటుందా? మొన్న మటుకు మొన్న- క్యాంప్ వెళ్ళబో తూంటే తనని దగ్గరికి తీసుకుని తొందరగా వచ్చేస్తానని భయ పడొద్దని చెప్తూ, 'నేను వచ్చేలోగా నువ్వు కొంచెం సన్న పడాలి' అన్నాడు. అది నిజమే! అంత అన్నం సహించక పోయినా, యేం తినకపోయినా తను బాగానేవుంది. ఒంటి రంగుకి కూడా ఏదో మెరుపువచ్చింది. తను లావుఅవటం శేఖరానికి యిష్టంలేదని తనకు తెలియదు. అందుకే అంది 'యేం లావయితే! అసలు నేను కొంచెం లావుగావుంటేనే బాగుంటానని అందరూ అంటారు' అంది. 'అబ్బెబ్బే! అదేం కాదమ్మాయి! లావు అయ్యేరోజులు ముందున్నాయి. యిప్పు డొద్దు. నువ్వు లావయిపోయి, కూర్చున్న చోటునుంచి కదల లేకపోతే' 'మీది మరీ విచిత్రం! అంత లావెందుకు అవుతాను?

'ఎంతయినావద్దు. నేను క్యాంప్‌నుంచి వచ్చేసరికి చేతులు చాచుకుని పరుగెత్తుకొస్తావు చూడు. బంగారు తీగెలా

వుంటావు. లావయితే బాగుండదు. నువ్వసలు పరుగెత్తలేవు. పరుగెత్తినా నేను చూడలేను.' ఇద్దరూ నవ్వుకున్నారు. అంత బాగా మాట్లాడి, అంత హుషారుగా మాట్లాడిన తన్ను దగ్గరికి తీసుకోవటంలో ఒళ్ళు వేడిగావుందని 'వద్దు. నీకు ఒంట్లో బాగాలేదు. నేను క్యాంప్ కాన్సిల్ చేసుకుంటా'నని కూర్చు న్నారు. ఆరోజు అసలు వుదయంనుంచే వంట్లో బాగాలేదు. ఆ క్రితం రోజే లేడీ డాక్టర్ సుశీలకి ఫోన్ చేస్తే ఆవిడ లేదు. ఎక్కడికో వెళ్ళిందన్నారు. క్యాంప్ వెళ్ళే హడావుడిలోవున్న శేఖరంగూడా పట్టించుకోలేదు. తనూ అంత అనుకోలేదు. ప్రయాణం అయి జీప్‌లో సామానంతా పెట్టించి, బట్టలు వేసు కుని టై కట్టుకుంటూన్న శేఖరం తను లోపలకు వెళ్ళి కాఫీతో తిరిగి వచ్చేసరికి టై విప్పి టేబిల్ మీద పారేసి వచ్చి పడకకుర్చీలో పడుకున్నాడు. తనకు తెలుసు. అతను వెళ్ళి తీరాలి, చాలా ముఖ్యం అని. డాక్టర్ సుశీల రాగానే పిలి పించుకుంటానని, లేకపోతే నేనే వెడ్తానని ఎన్నో చెప్పి వప్పిస్తే గాని అతను లేచి మళ్ళీ టై కట్టుకోలేదు. 'లేదు, నేను సరిగ్గా చూడనేలేదు. నీ మొహం చాలా పీక్కుపోయింది తెలుసా' అతని మొహంలో బాధకి తనకు నవ్వు వచ్చింది. కానీ అదెంత హాయి. ఒకళ్ళు మనకోసం ఆదుర్దాపడటం అనేది యెంతగొప్ప విషయం. మరో అరగంటలో వెళ్ళిపోయాడు. వెళ్ళిన తర్వాత తనకెంత దిగులో; మళ్ళీ అతన్ని కళ్ళతో చూస్తానా అన్పిస్తుంది. ఆ మర్నాడు సుశీల వచ్చింది. వస్తూనే ఆవిడ వేసిన మొదటి ప్రశ్నకి తనిచ్చిన జవాబులోనే చెప్పే

సింది. ఆ తర్వాత పరీక్షగూడా చేసి నవ్వుతూ "ఆడపిల్లా—మగపిల్లవాడా?"అని అడిగింది. యెక్కడో ఏదో ఆలోచిస్తున్న తను ఆవిడ ప్రశ్నకి సమాధానాన్ని అంతా గుర్తించకుండానే "యెవరికి?" అంది. యెవరన్నా ప్రసవించారో—ప్రసవిస్తారో అనుకుంటూ యెవరన్నా ప్రసవిస్తారు అన్నప్పుడే, చేతివేళ్ళలో రెండు చూపించి పట్టుకో మనటమో లేక ఆడపిల్లా, మగపిల్లవాడు కావాలా అని అడగటమో చేస్తారు. డాక్టర్ సుశీల విరగపడి నవ్వుతున్నప్పుడు గానీ తనకి గుర్తురాలేదు. ఆవిడ ప్రశ్న, తన జవాబు, ఆవిడ పరీక్ష—అన్నీ క్షణంసేపు గుండె కొట్టుకోనటం మానేసింది. ఇహ అసలు కొట్టుకోదేమో అన్పించింది. కూర్చున్న కుర్చీకి తన శరీరం అంటుకుపోయినట్లయింది. యేమిటీ-తనకా ? పాపా! ప్రపంచం అకస్మాత్తుగా మారిపోదేం ? వస్తువులన్నీ యిలాగే వుంటాయేం ? కిటికీ తలుపులన్నా కదలవేం ? గాలయినా గట్టిగా వీచదేం ? ఆకాశంలో మేఘాలయినా పరుగెత్తవేం? గుమ్మం అవతలవరండా దిగువగా పచ్చటి చెట్లమీదపడి మెరుస్తున్న సూర్యకాంతి పకపకా నవ్వదేం ? ఏం జరగదేం? యిదేమిటి యిలా ఆలోచిస్తుందేం తను ? "నిజంగానా !" జీరపోయిన గొంతుతో డాక్టర్ సుశీలవంక చూస్తూ అంది తను. "మీరు బలే తమాషాగా చూస్తారండీ! కళ్ళల్లో అన్ని భావాలు కదులాయేమిటి? నిజంగానే చెప్తున్నాను. వారు క్యాంప్‌నుంచి రాగానే మొదట నాకు బహుమతి యివ్వించాలి. కాన్పు అదీ నేనే చూస్తాను" నల్లగా పొడుగ్గావున్న సుశీల తెల్లటి పళ్ళన్నీ తళుక్కుమనేట్లు నవ్వి అంది. ఆవిడవైపే తదేకంగా చూస్తున్న వాసంతికి

ఆవిడ చేతిలో ఓ పసికందుని తెల్లటి తువాల్తో తుడుస్తూ "మీ పోలికండి—ముక్కు మటుకు తండ్రిది పుణికి పుచ్చుకున్నాడు. పాప చాలా ఆరోగ్యంగా వున్నాడు. చూశారా! మీరు నాకు మంచి బహుమతి యివ్వాలి" అంటున్నట్లు తను యేదో మంచంమీద పడుకుని చెవుల్లో దూదితో నీరసంగా పడుకుని ఆసక్తిగా, భయంగా ఆ పసిపాపవైపు చూస్తున్నట్లు అన్పించింది. తనసలు ఎప్పుడూ అంతే — వున్న విషయానికీ, జరుగుతున్న క్షణానికి పదింతలు ముందుకు దూసుకుపోయి ఆలోచిస్తుంది. ఈ క్షణంలో ఇప్పుడు జరుగుతున్నదాన్ని గురించి ఎప్పుడూ ఆలోచించదు. జరిగిపోయిన వాటిని గురించైనా ఆలోచిస్తుంది. లేకపోతే జరగబోయే వాటిని గురించయినా ఆలోచిస్తుంది. వర్తమానాన్ని గురించి ప్రసక్తే వుండదు, అది గతంగా మారేవరకు. ఏమిటో ఒక్కొక్కళ్ళ స్వభావం. సీతయితే—'జరిగిపోయింది, జరగబోయేది నాకు అక్కర్లేదు. జరుగుతున్నవే నాకు కావాలి. జరిగిందాంతో మనకు ప్రసక్తి లేదు. అది తిరిగిరాదు. ఎంత గొప్ప అనుభవం అయినాసరే — జరగబోతుందంటావా అయోమయం, అర్థంగాదు, మనతోపాటు ముందుకు పరుగెత్తే పెద్దగోడ భవిష్యత్తు. ఎప్పటికప్పుడు దాని వెనక ఏం వుందీ మనకి తెలియనే తెలియదు. అది తెలుసుకోవాలనే ప్రయత్నంతోనే మనం పరుగెత్తుతుంటాం. చివరకు తెలుసుకోకుండానే పోతూంటాం" అంటుంది. దానిది మరీ వేదాంతం. బ్రతుకంటే క్షణంలో సగంట. ఆ క్షణంలో సగంలోనే చాతనైతే ఇంద్రధనస్సులోవున్న రంగులన్నీ చూసినట్లు అన్నీ అనుభవించ

గలంటు. దాని మొహం. మరీ అంత చిన్న వయసులో అంత వేదాంతం వుండకూడదు బాబూ! అలాటి వాళ్ళకి యిల్లూ, సంసారాలుగూడా పట్టవు. సీత అదే అంటుంది. 'భర్తగాని, పిల్లలుగాని యివన్నీ ఓ బాధ్యతకింద మనం చెయ్యవలసిన పనులక్రింద తీసుకోవాలి' అంటుంది. తనకి శేఖరం ఎప్పుడూ లోకంగా కన్పిస్తాడుగానీ బాధ్యతగా అన్పించదు. తనకి పిల్లలు కావాలి. భర్త కావాలి. అన్నీ కావాలి. రేపు తనకి గూడా ఓ పాపపుడ్తే యిలాగే పుట్టినరోజు చేసుకోదూ! త నప్పుడు యెలా వుంటుంది? శేఖరం చెప్పినట్లు లావయి, నిండుగా జడమానేసి మెడమీదకు చుట్టతో వుంటుంది కాబోలు. అమ్మో! యిలా సన్నగా వుంటేనే బాగుంటుంది. చిన్నతనం మననుంచి వెళ్ళిపోతుంటే ఎంత బాధేస్తుంది - అందుకే కాబోలు మనకు తెలియకుండానే మనం పెద్దవాళ్ళం అయి పోతూవుంటాం.

చాలా సేపట్నుంచీ తదేకంగా ఆలోచిస్తున్న వాసంతి యెవరోవచ్చి పల్కరించటంతో యీ లోకంలో పడింది. ఆ వచ్చిన అమ్మాయి సుకన్యాదేవి అక్క కూతురు కాబోలు-"పిన్ని మిమ్మల్ని లోపలకు పిలుస్తోంది" అంటూ వచ్చింది. యిదేమిటి! చాలా సేపయింది. వాసంతి ఖంగారుగా లేచి నిలబడింది. హాలులో చాలాభాగం ఖాళీ అయిపోయింది. గోడవారగా కూర్చున్న ఆంగ్లో యిండియన్స్ వెళ్ళిపోయారు. హాలులో చాలా కొద్దిమంది మిగిలారు. స్టేజీ గూడా ఖాళీ అయింది. వాసంతి దిక్కులు చూడటం మానేసి తనని పిలవ టానికి వచ్చిన అమ్మాయిని "యెక్కడికి రావాలి?" అంది.

"లోపలికి, అక్కడ ఫలహారంచేసి మళ్ళీ వచ్చి కూర్చుందుకు గాని" దూరంగా కూర్చుని అంతకుముందు వాసంతినిచూసి నవ్వుతూ ఖబుర్లు చెప్పుకున్న అమ్మాయిలవంక మెడ తిప్పి చూసి నవ్వుతూ అంది ఆ అమ్మాయి. వాళ్ళని చూచేసరికి వాసంతికి మళ్ళా దిగులు ముంచుకువచ్చింది. వాళ్ళింకా అలానే చూస్తూ వున్నారు 'రండి' అని పిలుస్తున్న అమ్మాయితో యెలాగో లోపలకు వెళ్ళబోయింది వాసంతి. గుమ్మానికి కొంచెం యివతల వుండగానే ఆ ముగ్గురు అమ్మాయిలు వాసంతి వైపుకి వచ్చారు. "పరిచయం చెయ్యాలా — ఇదుగో వీళ్ళు నా స్నేహితురాళ్ళండీ ! యీమె వాసంతి అని శేఖరం గారి భార్య. వారు, మాబావగారు మంచి ఫ్రెండ్స్!" అంది సుకన్యాదేవి చిన్నికూతురు. వాళ్ళ ముగ్గురికీ నమస్కారాలు చేసింది వాసంతి. అందులో మధ్య అమ్మాయి అంది, "మిమ్మల్ని చూసింతర్వాత మీతో తప్పకుండా పరిచయం చేసుకోవాలనిపించిందండీ! మీ కళ్ళు చాలా బాగున్నాయి. యిందాకట్నుంచీ మీవంకే చూస్తున్నాను"

వాసంతి కళ్ళు క్రిందికి వాలియాపోయి. అంత ధైర్యగా నిర్మొహమాటంగా మొహంమీద చెప్పేస్తున్న ఆ అమ్మాయి వంక కళ్ళెత్తి చూడటం గూడా భయమనిపించింది.

"ఈ అమ్మాయి కథలు రాస్తుందిలే, అందుకు అంది" మరో అమ్మాయి. "అది అనవసర ప్రసంగం" మొదటమ్మాయి కసిరింది. పేరడిగింది వాసంతి. జవాబు చెప్పింది ఆ అమ్మాయి. ఆ పేరు వాసంతికి పరిచయమే. కథలు గూడా బాగానే వుంటాయి. కానీ అమ్మాయి వయసు తక్కువగావుందే-

అంతమంచి కథలు రాయడం ఎలావస్తుందీ అనుకుంటున్న వాసంతికి "పదండి! లోపల పిన్ని వెయిట్ చేస్తోంది" అంది సుకన్యాదేవి అక్కకూతురు. మరోసారి వాళ్ళ ముగ్గురికీ నమస్కారంచేసి వాసంతి యివతలకు వచ్చింది. అప్పటికే సుకన్యాదేవి బైటకు వచ్చేసింది. "మీరు లోపలకు వెళ్ళండి! చూడు, గిరిజా! వాసంతిని లోపలకు తీసుకువెళ్ళు. ఇక్కడ అహల్యాదేవి వెడ్తున్నానంటున్నారు. పంపిస్తాను. లోపలికి వెళ్ళు వాసంతీ! సిగ్గుపడకు" మాటలు చెప్తూనే ఆవిడ హడావుడిగా వెళ్ళిపోయారు. గిరిజ లోపలికి వెడ్తూండగా వాసంతి చటుక్కున చెయిపట్టి ఆపి, "మీ అక్కయ్యకూతురెక్కడ? అంది. చేతిలో వుండిపోయిన సోప్ బాక్సు గుర్తుకు రావటంతో "ఎవరూ— జయంతా ? అక్కడ ఆ గదిలో వుందే! అంది గిరిజ ఆగిపోతూ. వాసంతి తలతిప్పి చూసింది. గిరిజ చూపించిన గదిలో జయంతి, ఆవిడ ప్రక్కన ఆ లావుపాటి ఆవిడ, ఖద్దరు చీర ఆవిడ వున్నారు. "నువ్వొక్క పనిచేసిపెట్టు, నేను వెడ్తూ వుంటాను. నువ్విది మీ జయంతికిచ్చేసి రా!" అంది.

"అదేమిటి—మీరివ్వండి!" గిరిజ . అనుమానంగా చూస్తూ అంది.

"కాదు—వారి పేరు చెప్పి నువ్విచ్చేసి రా!" బ్రతిమాలుతున్నట్లుగా అంది వాసంతి. క్షణంసేపు వాసంతి మొహంలోకి చూసిన గిరిజ సోప్ బాక్సు తీసుకొని వెళ్ళింది. ఎంత త్వరగా ముగించుకుని బైటపడితే అంత బాగుండు – 'ఏరీ— యిక్కడ యిందాక రక్షకభటుల్లా నిలబడ్డ అమ్మాయిలు లేరే, పోయారే' అనుకుంటూ తలవంచుకుని లోపలకి వస్తున్న వాసంతికి అలాగే

తలవంచుకుని గబగబా లోపల్నుంచి వస్తున్న మరోవ్యక్తి తపీమని తలకొట్టింది. ఇద్దరూ ఒక్కసారి అబ్బా అనుకుని దెబ్బ తగిలినచోటు పట్టుకుని తలెత్తి చూశారు. "సారీ, చూడ లేదు" అంది అవతల వ్యక్తి. వాసంతి యెత్తేవుంది. కానీ నాలు గైదు సంవత్సరాలు పెద్దదిలావుంది. పొడుక్కి-తగ్గ లావుతో, మనిషి హుందాగా వుంది, చాలా అందంగా వుంది. శరీర సౌష్టవానికి చక్కగా అతికినట్లున్న చీరె, జాకెట్. కానీ జాకెట్ చేతులు భుజాల దిగువుగా పొట్టిగా చాలా బిగుతుగా వున్నాయి. చెంపలకి చీరెరంగుతో కలసే ద్రాక్షగుత్తుల్లా వున్న ప్లాస్టిక్‌వి వున్నాయి. పెదవులకి రంగుంది. కానీ రంగు వేసుకున్నట్టు లేదు, చాలా సహజంగా వుంది.

"సారీ దెబ్బతగిలిందా ?" అంది ఆవిడ నవ్వుతూ.

"లేదు. ఫర్వాలేదు" వాసంతిగూడా నవ్వింది.

"వెరీ వెరీ సారీ!" వాసంతిని తప్పించుకుని వెళ్ళిపోయింది ఆవిడ. ఆవిడని యింకా సాంతం చూడటం పూర్తిగాని వాసంతి తలతిప్పి ఆవిడ వచ్చినవైపే చూస్తూండిపోయింది. వెనక నడి నెత్తిమీదికి జుట్టు మెలితిప్పి చుట్టిన చుట్ట, వెనక జాకెట్‌కి వీపుమీద డైమండ్ ఆకారంలో బట్టలేదు. ఆ బట్టలేనంత మేర బిగువుగా అందంగా శరీరం కన్పిస్తోంది. మెడలో గొలు సుండే భాగంనుంచి ఆ కత్తిరించిన డైమండ్ ఆకారం మీదుగా పట్టుకుచ్చులు చిన్న చిన్నవి నడుందాకా వేళ్ళాడు తున్నాయి. నడకగూడా బాగానే వుంది. వెడుతూ వెడుతూ ఆవిడ ఒకసారి వెనక్కి తిరిగిచూసి యింకా అలాగే నిలబడి పోయి తనవంక చూస్తున్న వాసంతిని చూసి మళ్ళీనవ్వి వెళ్ళి

పోయింది. ఆవిడ చూడగానే వాసంతి చప్పున మొహం తిప్పు కుంది. ఇంతలో గిరిజ వచ్చింది "ఆవిడెవరు ?" దూరంగా వెళ్ళిపోయి సుకన్యాదేవితో మాట్లాడుతున్న ఆవిడని చెయి చాచి వేలుపెట్టి చూపిస్తూ అంది. "యెవరూ-ఆవిడా ! మా అక్కయ్య ఫ్రెండ్, బొంబాయిలో వుంటారు. ఆవిడ భర్త అమెరికా వెళ్ళివచ్చారు. ఆమెగూడా వెళ్ళివచ్చింది." లోపలకు దారితీస్తూ అంది గిరిజ.

ఫలహారం అదీ ముగించుకుని గిరిజతో పాటు యివతలకు వచ్చింది వాసంతి. హాలు పూర్తిగా ఖాళీ అయిపోయింది. పెద్ద వర్షం గబగబాపడి ఒక్కసారి తెరిపి వచ్చినట్లుగావుంది. హాలులో దీపాల గుత్తి క్రిందుగా నిలబడి ఆవిడ, సుకన్యాదేవి యింకా ఏదో మాట్లాడుకుంటూనేవున్నారు. "ఆగండి, మీకు కిళ్ళీ తీసుకొస్తాను" అంటూ గిరిజ మధ్యలో వెనక్కు వెళ్ళిపోయింది. "ఇక్కడకు రా వాసంతీ! " దూరంగా నిలబడి సుకన్యాదేవి పిలవడంతో గిరిజకోసం చూస్తున్నట్లు నిలబడి వాసంతి కదిలి ముందుకు వెళ్ళింది. "ఈవిడ నా స్నేహితురాలు, అమూల్య" ఈవిడ పేరు అమూల్యా! మనిషిలానే పేరు గూడా చక్కగా అమూల్యంగానే వుంది అనుకుంది వసంత చేతులు జోడించి నమస్కరిస్తూ. "నీ పేరేమిటి, వాసంతా !" అంది ఆవిడ బాగా దగ్గరగావచ్చి. ఆవిడ చూపుల్లో యిందాకటి మార్దవం, లాలిత్యం రెండూ లేవు. అవేవో చురకలు వేసినట్లు, అవి తగిలినచోటల్లా గుచ్చుకుంటున్నట్లూ వున్నాయి. ఆవిడలో ఆ మార్పు యెందుకు వచ్చిందో అర్థంగాని వాసంతి అచేతనంగా అలాగే నిలబడిపోయింది. పైనవున్న దీపాల

గుత్తిలోంచి వస్తున్న రంగు రంగుల కాంతులు ఆవిడ మొహం మీద నీలంగా, సుకన్యాదేవి మొహంమీద ఎర్రగా తన మొహంమీద తెల్లగా పడుతున్నాయి.

"శేఖరం నీకు పెళ్ళికిముందే తెలుసా ?" హఠాత్తుగా ఆవిడ చెయిచాచి వాసంతి గడ్డాన్ని మునివేళ్ళతో పట్టుకుని యెత్తుతూ అంది. ఆ యెత్తడం ప్రేమగా కాక, అదేదో అసక్తిగా వుంది. అసలు సుకన్యాదేవి ఆవిడని తనకు పరిచయం చేసిందిగాని, తనకు ఆవిడకు పరిచయం లేదు. కానీ తనపేరు ఆవిడకి తెలిసింది. పోనీ అది ఆవిడకి యీావిడ చెప్పి వుండవచ్చు. కానీ శేఖరం సంగతి అడుగుతుందేమిటి ? గడ్డాన్ని ఆవిడ చేతిలోంచి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూ ఆవిడ చూపులతో కలసిన తన చూపుల్ని క్రిందికి తిప్పుకుంది వాసంతి. "కొంచెం సిగ్గులావుందే లేకపోతే కొత్తా ?" ఆవిడ గడ్డం వదలకుండానే అంది. పైనుంచి వస్తున్న రంగు రంగుల కాంతులు యెదురుగుండా యీావిడ వింత ప్రవర్తన, నిశ్శబ్దంగా వున్న హాలు చాలాసేపట్నుంచీ కూర్చుని కూర్చుని అలిసిపోయినట్లుగా అదో మాదిరిగా వున్న వాసంతికి అదేదో కలలో యెక్కడో వంటరిగా కూర్చుని ఆలోచిస్తున్న ఓ దృశ్యంలా అన్పిస్తోంది. ఆవిడ ప్రశ్నకేదో సమాధానం చెప్దామని అనుకుంటూండగానే హఠాత్తుగా వెనకనుంచి "వసూ!" అనే పిలుపు విన్పించటంతో ముగ్గురూ వులిక్కిపడి వెనక్కి తిరిగారు. "అరె! మీరా? యెప్పుడొచ్చారు? రేపుగదూ రావాల్సింది!" గిరుక్కున వెనక్కి తిరిగిన వాసంతి శేఖరాన్ని

చూడటంతోనే ఒక్క పరుగులో దగ్గరకు వచ్చింది. "మీరు రేపు సాయంత్రంగానీ రారనుకున్నాను, యెలా వచ్చారు?" సంతోషంతో వికసించిన మొహంతో వాసంతి భర్త చెయ్యి తనచేతిలోకి తీసుకోబోయింది. కానీ శేఖరం వాసంతిని గమనించటంలేదు. అతని చూపులు దూరంగా నిలబడ్డ వస్తువు మీద రెప్పవాల్చకుండా చూస్తున్నాయి. తనచేయి పట్టుకోబోతూ అడ్డుగా వచ్చిన వాసంతిని పట్టి ప్రక్కకు లాగాడు. ఆసించని యీ ప్రవర్తనతో తెల్లబోయిన వాసంతి, శేఖరం చూస్తున్నవైపు చూసింది. దూరంగా రంగు రంగు దీపాల గుత్తిక్రింద నిలబడ్డ అమూల్య తల కొంచెంగా ప్రక్కకు ఒరగ పెట్టి అదోరకమైన చిరునవ్వుతో ఠీవిగా నవ్వుతూ శేఖరం వైపు చూస్తోంది. శేఖరంగూడా చూస్తున్నాడు. కానీ బాధగా, అసహ్యంగా, కోపంగా వున్నాయి ఆ చూపులు. వాసంతికి అవి పరిచయంలేవు. ఒకటికి రెండుసార్లు, మూడు సార్లు ఆవిడవంక, శేఖరంవంక కొయ్యబొమ్మలా నిలబడిపోయిన సుకన్యాదేవివంక తలతిప్పి చూసింది వాసంతి.

"పద పోదాం!" హఠాత్తుగా భార్య భుజంచుట్టూ చేయి వేసి తిప్పేస్తూ అన్నాడు శేఖరం.

"అదేమిటి! రండి, లోపలికి వెద్దురుగాని" — చలనం తెచ్చుకున్న సుకన్యాదేవి ముందుకువస్తూ గబగబా అంది.

"అక్కర్లేదు, ముందు మీరు నాకు చెప్పినట్లయితే వాసంతిని యిక్కడికి రానిచ్చేవాడినికాదు." కఠినంగా జవాబిచ్చిన శేఖరం మరుక్షణంలో వాసంతి చేయిపట్టి ముందుకు గుంజుకుపోయాడు. "ఎవరావిడ? ఎందుకిలాచేస్తారు?" శేఖరం

లాక్కొస్తూంటే వచ్చేస్తున్న వాసంతి వెనక్కి తిరిగిచూస్తూ అంది. ఆవిడ యింకా అలాగే నిలబడి వుంది. కానీ యీసారి మొహంలో ఠీవిగా వున్న ఆ చిరునవ్వు లేదు.

ఐదు నిమిషాల్లో చేరవలసిన దోవ వదిలి చుట్టు తిప్పి అరగంటకిగాని యింటికి తీసుకురాలేదు శేఖరం. దోవలో మళ్ళీ తనే అడిగింది వాసంతి– "ఎవరావిడ మీకు తెలుసా?" అని. కానీ శేఖరం జవాబు చెప్పలేదు. పెదవులు బిగించి రోడ్డుని తదేకంగా చూస్తున్నాడు. మరోసారి ఏదో అడగ బోయింది వాసంతి "నన్ను మాట్లాడించకు. ఆవిడ నాకు తెలుసు, అంతే!" కోపంగా పెళ్ళయిన తర్వాత మొట్టమొదటి సారిగా గట్టిగా కసురుతూ అన్నాడు శేఖరం. వాసంతి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. మధ్య తనేం చేసిందనీ? అసలు యిలా మధ్యలో క్యాంప్‌నుంచి రావటం ఏమిటి ? పోనీ వచ్చారు. కానీ వచ్చారన్న సంతోషం లేకుండా యిదేమిటి? కళ్ళనుంచి వుబికి బుగ్గలమీదకు జారుతున్న నీళ్ళని తుడుచుకోవటానికి ప్రయత్నించలేదు. తుడుచుకుంటే అతనికి ఏడుస్తున్నట్లు తెలుస్తుంది. అతను రాగానే తను ఎన్ని చెప్పాలనుకుంటోంది ! అన్నీ పోయినాయి. నిటారుగా కూర్చుండిపోయింది వాసంతి.

ఇంటికి వస్తూనే అలవాటు ప్రకారం కారుని గేరేజ్‌లో పెట్టకుండానే వరండా మెట్లముందు వదిలేసి శేఖరం లోపలి కొచ్చి గదిలో,కుర్చీలో కూలబడ్డాడు. మాట, పలుకు లేకుండా తనకు సంబంధించనట్లున్న శేఖరాన్ని అలా మొదటిసారిగా చూస్తున్న వాసంతికి అతని దగ్గరకు వెళ్ళే సాహసంలేక హాలులో కిటికీ దగ్గర అలాగే నిలబడిపోయింది. ఎవరసలావిడ?

శేఖరం ఎందుకలా అయ్యాడు ? వాసంతికి తల పగలగొట్టుకున్నా అర్థం గావటంలేదు.

గదిలోకి వచ్చేసిన శేఖరం లైటుతీసేసి బూట్లు గూడా విప్పుకోకుండా పడకకుర్చీలో వాలిపోయాడు. హఠాత్తుగా అతనిలో శక్తిఅంతా పోయినట్లుంది. 'మళ్ళీ అమూల్య ఎందుకు కన్పించినట్లు ? నాలుగు సంవత్సరాలక్రితం రెండు సంవత్సరాల దాంపత్య జీవితంలో నరకం చూపించి తనని కాదని, అసమర్థుడని తీసిపారేసి మరొకరితో కలకత్తా వెళ్ళి పోయిన అమూల్య మళ్ళీ ఎందుకొచ్చింది తన జీవితంలోకి ? అమూల్యతో జీవితం కలకత్తానుంచి రాసిన ఆఖరి ఉత్తరం అన్నీ కలిపి తనని, మనశ్శాంతికి దూరంచేసి పిచ్చివాడిలాగా చేసి దేశాలవెంట తరిమినాయి. ఎలాగో కోలుకున్నాడు. పగిలిన హృదయపు ముక్కలు యేరి యిచ్చింది వాసంతి. వాటిని వాసంతి అమాయకపు హృదయం సాయంతో అతుకు పెట్టుకున్నాడు. మళ్ళీ వచ్చింది అమూల్య! అమూల్యని ఎదిరించే సాహసం తన కెప్పటికీరాదా ? యిప్పుడు మరోసారి పిచ్చివాణ్ని చెయ్యటానికే పనిగట్టుకుని వచ్చిందా అమూల్య? వాసంతి ! పిచ్చి వాసంతి, ఇదంతా చూసి ఏమనుకుంటుందో! తన మొదటిభార్య బ్రతికివుందని వాసంతికి తెలియదు.' శేఖరం కుర్చీలో లేచి కూర్చుని "వసూ!" అని పిల్చాడు. 'పిచ్చిపిల్ల. అసలే కాస్తంతవాటిని గంపంతగా వూహించుకుని కళ్ళు పెద్ద పెద్దవి చేసుకుని చూస్తుంటుంది. ఒకవేళ అమూల్య భర్త యిక్కడకు వుద్యోగ రీత్యా వస్తే తను యీ వుద్యోగాన్ని, యీ వూరుని వదిలేసి వాసంతిని తీసుకుని యే పల్లెటూరికైనా

పారిపోతాడు. "ఇక్కడికిరా, లైటు వెయ్యి!" నెమ్మదిగా వస్తున్న అడుగులుచప్పుడు విని మళ్ళీ వెనక్కువాలి పడుకున్నాడు శేఖరం. వాసంతి లైటు వేసి యింకా చేతిని అలా స్విచ్ మీదనేవుంచి శేఖరాన్ని గమనిస్తోంది.

"అలా నిలబడ్డావేం? దగ్గరకు రా!" చేయి చాపియిస్తూ అన్నాడు.

"మీరలా ఎందుకున్నారు?" ఆవిడ ఎవరు అనే ప్రశ్న మళ్ళీ నాలిక చివరిదాకా వచ్చి ఆగిపోయింది.

"ఎలావున్నానూ? నాకు ఒంట్లో బాగాలేదు. అందుకే తిరిగి వచ్చేశాను. నిజం, భోంచేద్దాం పద!" లేచి సరిగ్గా కూర్చుని వంగి కాలిబూటు విప్పుకుంటూ అన్నాడు.

ఆరాత్రి అతను నిద్రపోలేదు. వాసంతి గూడా నిద్ర పోలేదు. చాలా రాత్రయింతర్వాత మంచం మీద నిద్ర లేకుండా అటు యిటూ దొర్లుతున్న అతన్ని చాలాసేపట్నుంచీ గమనిస్తున్న వాసంతి లేచికూర్చుని "వున్న విషయం ఏమిటో పైకి చెప్తే కొంతయినా మనశ్శాంతి లభిస్తుంది. ఏ విషయం అయినా భార్యతో చెప్పటానికి జంకెందుకు చెప్పండి! మీ ఆనందంలోనే కాదు — మీ బాధలో గూడా నాకు భాగం యివ్వాలి" శేఖరం వాసంతి మాటలకు జవాబివ్వలేదు. కానీ బోర్లగా పడుకుని దిండులో తలదాచుకుని బాధగా అటూ యిటూ కదులుతున్నాడు.

"పోనీండి! మీకింత చెప్పటానికి కిష్టంలేకపోతే చెప్పద్దు. మీరు నిజంగా ఒంట్లో బాగాలేకనే తిరిగి వచ్చినట్లయితే

నిద్రపోవటానికి ప్రయత్నించండి!" శేఖరం జుట్టులో వేళ్ళు పోనిస్తూ ఆప్యాయంగా అంది.

ఆడవాళ్ళని అనుభవాలు చిత్రంగా ఎదిగిపోయేట్లు చేస్తాయి. ఎందుకో రెండుగంటల క్రితం తనకి — ఇప్పటికీ చాలా తేడా కన్పిస్తోంది వాసంతికి. ఏదో పెద్దరికం వచ్చేసింది. హఠాత్తుగా వున్నట్లుండి వాసంతి చేయితీసుకుని గట్టిగా పట్టుకుని "నువ్వు నాకీ ప్రశ్నకు జవాబు చెప్పు! నేను ఈ ఉద్యోగం, ఈ డబ్బు లేకుండా ఎక్కడికి రమ్మంటే అక్కడకు వస్తావా?" అతనేం మాట్లాడుతున్నాడో వాసంతికి అర్థంగావటంలేదు. శేఖరం తిరిగి సరిగ్గా పడుకుని భార్యచెయ్యి కళ్ళకి అన్చుకుంటూ "చెప్పు వసూ! ఏదీ మనిద్దర్నీ విడదియ్యలేదని చెప్పు, నువ్వు నన్ను పెళ్ళిచేసుకున్నావని, ఎప్పుడూ నా ప్రక్క వదలనని చెప్పు! నా మనశ్శాంతి దూరంకాదని చెప్పు! చెప్పవూ?" కళ్ళు మూసుకుని అంటున్న అతను హఠాత్తుగా కళ్ళు తెరిచి రెండు చేతులు చాచి దగ్గరకు లాక్కుంటూ "చెప్పు, చెప్పు! ఎలాంటి పరిస్థితులలోనూ నిన్ను వదిలిపెట్టి వెళ్ళనని చెప్పు! అబద్ధం అయినా సరే ఇప్పటికిలా చెప్పు! మనసారా చెప్పవూ?" తన భుజాలు విరిగిపోతాయేమోనన్నంత గట్టిగా పట్టుకుని పిచ్చిగా చూస్తున్న భర్త కళ్ళల్లోకి లోతుగా, పరీక్షగా చూసింది వాసంతి. అతని కళ్ళు దేన్నో ఒకసారి పోగొట్టుకుని మరోసారి పోగొట్టుకుంటానేమోననే భయంతో వున్నాయి. "ఆవిడెవరో ముందు చెప్పండి!" శేఖరం చప్పున వాసంతిని వదిలేసి మొహం ప్రక్కకు తిప్పుకున్నాడు.

"పోనీ, నన్నేం చెయ్యమంటారో చెప్పండి!" మరోసారి కళ్ళల్లో తిరగబోతున్న నీళ్ళని బలవంతాన ఆపుకోటానికి ప్రయత్నిస్తూ అంది.

"ఆవిడ అమూల్య!" – యెలాగో అన్నాడు శేఖరం.

"అవును, అది ఆవిడ పేరు. అయితే – ఆవిడేమయినా మీ మొదటి భార్యకు బంధువా ?"

"కాదు, అమూల్యే! నీకు తెలియదు నా మొదటి భార్య బ్రతికివుందని, నన్ను వదిలేసి పారిపోయిందని" వాసంతికి నోట మాట రాలేదు – 'ఏమిటిది, ఏమిటిది' మనసులో యెవరో దిగులుగా యేడవబోతున్నారు. "ఆవిడ చచ్చిపోలేదూ ?" శేఖరం మొహంలోకి చూస్తూ అంది. వాసంతికి హఠాత్తుగా నీరసం వచ్చేసింది. "కాదు, ఏం చెప్పాలో తెలియక మీ మామయ్యా వాళ్ళకి చచ్చిపోయిందని చెప్పాను. అబద్ధం ఆడాను. అందులో నాతప్పులేదు వాసంతీ! వింటానంటే, ఓపిక వుందంటే నీకు ఓ కథ చెప్తాను" దగ్గరగా లాక్కుని గుండెలకి నొక్కుకుంటూ అన్నాడు శేఖరం.

"చెప్పండి!" నీరసంగా అంది వాసంతి. 'అమ్మాయి వాసంతీ!–అయింది నీపని. అదృష్టం అదృష్టం అని తెగమురిసి పోతున్నావే ? అది కాస్తా ఆరిపోయింది. ఇహ నీ యిష్టం !' వాసంతి మనసులో గట్టిగా అరుస్తున్నారెవరో. 'అబద్ధం— అబద్ధం – యేం కాదు. యిదో కల – కాసేపటిలో కరిగి పోతుంది. అప్పుడు తను లేచి కూర్చుని శేఖరానికి యిదంతా వర్ణించి చెపుతుంది. యింకోళ్ళు పోట్లాడుతున్నారు. శేఖరం చెప్పటం మొదలుపెట్టాడు.

అమూల్యని అతను యెప్పుడు యెక్కడ చూశాడో సరిగ్గా జ్ఞాపకంలేదు. అప్పటికింకా ఆంధ్రప్రదేశ్ రాలేదు. శేఖరం తండ్రి మద్రాసులో హైకోర్టు వకీలుగా పనిచేస్తూండేవాడు. అవి అతను చదువుకునే రోజులు. అమూల్య ఏ కాలేజీలోనూ చదువుకోవటంలేదు. ఇంటరు మూడుసార్లు తప్పి యింట్లోనే కూర్చుంది. అమూల్య తండ్రి ఎలక్ట్రిక్ పార్ట్సు అవీ అమ్మే వ్యాపారం చేస్తుండేవాడు. కారు, పెద్ద బంగళా, నౌకర్లు చాలా అట్టహాసంగానే వుండేవారు. వస్తుతః ఉత్సాహవంతుడు. పదిమందిని కలుపుకుని ఏపని అయినా యిట్టే నెరవేర్చే బుద్ధికుశలతగల శేఖరం కాలేజీలోనేగాక యువతల సాంఘికంగాకూడా మంచిపేరు తెచ్చుకున్నాడు. అమూల్య ఏదో పెళ్ళిలో దూరంనుంచి చూసింది శేఖర్ని. ఆ తర్వాత అనుకోకుండా వెంట వెంట ఒకసారి పుట్టినరోజు పార్టీకి, మరోసారి ఏదో పార్టీకి అలా కలుసుకున్నారు. ఆఖరికి బాగా పరిచయం ఏర్పడింది. అనుకుని చెప్పుకోవాల్సింది మహాబలిపురం ఎక్స్కర్షన్. దాని తర్వాత శేఖరం కోరికమీద పక్షితీర్థం చూడటానికి వంటరిగానే శేఖరంతో వచ్చింది అమూల్య. ఆపైన సినిమాలకి, బీచ్కి తరుచుగా కలిసి వెళ్ళేవాళ్ళు. అమూల్యకి తనంటే యిష్టం. తనకి అమూల్యంటే యిష్టం. యిష్టం కాదా మరి! ఎంత ఇష్టంలేకపోతే ఇంత ద్వేషం పుట్టుంది? పెళ్ళిచేసుకోమని అడిగాడు. ఒప్పుకుంది. చాలా సహజంగా జరిగిపోయింది. అంతా చాలా అద్భుతమైన జంట-యిలాటివి చాలా అరుదు అని మెచ్చుకున్నారు. తండ్రికి అంత యిష్టం లేకపోయినా గట్టిగా కాదనలేదు. అసలే ఆయన గుండెజబ్బుతో

బాధపడ్తున్నారు. ఎక్కువ రోజులు బ్రతికబోవటం లేదని విస్పష్టంగా తెలుసుకున్న ఆయన యీ కాస్తలో కొడుకుని బాధపెట్టటం యిష్టంలేక సరే నన్నారు. ఆర్నెల్లు బాగానే గడిచిపోయినాయి. పెళ్ళికాకముందు తనకు కన్పించిన అమూల్యలో తను చూసినవి చాలా తాత్కాలికమైనవని శేఖరానికి అర్థంకాసాగింది. కొంతమంది అంతే. నలుగురిలో వున్నప్పుడు ఓ రకంగా, ఒంటరిగా వున్నప్పుడు ఓ రకంగా వుంటారు. డబ్బుమీద అమూల్యకిగల విపరీతమైన కాంక్షకి కొన్ని కొన్ని విలువైన విషయాలని అతి నిర్లక్ష్యంగా తోసి పారేసే మనస్తత్వానికి శేఖరానికి చిరాకు రాసాగింది. దానికి తోడు తండ్రి అనారోగ్యం, ఒకే ఒక్కడైన శేఖరం మీద పంచప్రాణాలు పెట్టుకునివున్న ఆయన కొడుకుని క్షణం అవతలకీ, యివతలకీ కదలనిచ్చేవాడు కాదు. అది అర్థంచేసుకో లేని అమూల్య శేఖరం తననికావాలని నిర్లక్ష్యం చేస్తున్నా డని బాధపడి యిష్టంవచ్చినట్లు మాట్లాడేది. లెక్కలేనట్లు ప్రవర్తించేది. ఎంతో వున్నతంగా– ఆదర్శవంతంగా వుంటుంది అనుకున్న అమూల్య యిలా మారటం చూసి శేఖరాని కేం చెయ్యాలో తోచలేదు. అక్కడికీ వోపికపట్టి అమూల్యకి అసలు విషయం అర్థం అయేలా చెయ్యటానికి ప్రయత్నించే వాడు. దాన్ని చాతకానితనంగా తీసుకున్న అమూల్య వాళ్ళతో, వీళ్ళతో 'శేఖరం పైకి కన్పించేటటువంటి వ్యక్తి గాదని, అతనిలో రెండు రకాలున్నాయని అతన్ని పెళ్ళిచేసు కోవటంలో తను చాలా బుద్ధి తక్కువపనిచేసి ఫలితం అనుభ విస్తున్నా'నని అనేది. అది ఒక్క శేఖరంతోనే గాదు, స్నేహి

తులతో, అన్నగార్లతో, తండ్రితో అందరితో చెప్పేది. ఆ పైన వాళ్ళు, వీళ్ళు రావటం, శేఖరానికి ఏదో చెప్పబోవటం, దానితో గొడవలు జరగటం— వదిలేసి పుట్టింటికి వెళ్తానని అమూల్య బెదిరించటం, ఈలోపల తండ్రిపోవటం— శేఖరానికి మతిచెడినంత పనైంది. ఓ ప్రక్క తండ్రిపోయాడనే దిగులు, మరోప్రక్క దాంపత్య జీవితం భగ్నమైందన్న దిగులు, అందరికంటే అతీతంగా, ఆదర్శంగా వుండాలన్న ప్రయత్నం పోయి అందరికంటే అసహ్యంగా అయిపోయింది అనే ఆవేదన— శేఖరం ఆరోగ్యం పాడయిపోయింది. ఈ మధ్యలో మామగారు, బావమరుదులు వుద్యోగంకోసం ప్రయత్నం చెయ్యమనే వేధింపు. శేఖరం ప్రతిదానికి చిరాకుపడసాగాడు. ఒకరోజు ఏదో డబ్బు విషయంలో పెద్దగొడవ జరిగి అమూల్య తండ్రి దగ్గరికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ పోతూ మెళ్ళో మంగళ సూత్రాన్ని తీసి "నువ్వింత చాతకానివాడివని తెలిస్తే చచ్చినా పెళ్ళిచేసుకునేదాన్ని కాను!" అంటూ మొహాన విసిరి కొట్టింది. ఆ వెళ్ళిపోవటం ఆఖరని, అప్పటికే అమూల్య మరొకరితో సంబంధం పెట్టుకుని అతన్ని పెళ్ళిచేసుకోవటానికి సిద్ధంగా వుందనీ శేఖరానికి తెలియదు. ప్రతిసారిలా అతను అమూల్యను తీసుకురావటానికి మామగారి దగ్గరకు వెళ్ళలేదు. గాయపడ్డ అతని హృదయం కోలుకోవటానికి టైం కావాలంది. శేఖరం తనని తను తమాయించుకుని నిగ్రహం తెచ్చుకుని, అమూల్యని యెలా దారికి తీసుకురావాలో నిర్ణయించుకుని మామగారి దగ్గరికి వెళ్ళేసరికి అప్పటికి 'నాలుగురోజుల క్రితమే అమూల్య ప్రసాద్‌తో కలకత్తా వెళ్ళిపోయింది. వాళ్ళిద్దరూ

పెళ్ళిచేసుకునే ప్రయత్నంలో వున్నారని, అతను కొద్దిరోజుల్లో అమెరికా వెడుతున్నాడని, అమూల్యగూడా వెడుతుందని, అనవసరంగా అమూల్యకోసం వెర్రిప్రయత్నాలు చెయ్యొద్దని, మంచిగా డైవోర్సు చెయ్యటం ఉభయకుటుంబాల పరువు ప్రతిష్టలకి మంచిదని ఆయన గట్టిగా అరగంటసేపు లెక్చరిచ్చాడు. కొయ్యబారిపోయిన శేఖరం ఇంటికి తిరిగివచ్చాడు. యెలా చేసుకుంటుంది ప్రసాద్‌ని? తనకి ప్రసాద్ తెలుసు. తనలో లేనివి ప్రసాద్‌లో ఏంవున్నాయని అతన్ని చేసుకుంటుంది?

తననికాదని అసలు ఎలా చేసుకుంటుందో– కోపంతో అవమానంతో, నరనరంకాలిపోతున్న శేఖరం అమూల్యమీద ప్రతీకారం తీర్చుకోవటానికి ప్రసాద్‌తో పెళ్ళి విఫలం కావటానికి ప్రయత్నాలు చెయ్యసాగాడు. దాదాపు ఒకనెల పోయింతర్వాత అనుకోకుండా అమూల్యదగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. అందులో 'తనమానాన తనని పోనివ్వమని, ఒకవేళ తిరిగివచ్చినా తనతో శేఖరం సుఖపడలేని– కనీసం యిలా మంచిగా విడిపోనైనా విడిపోతే మళ్ళీ ఎప్పుడన్నా కలుసుకున్నప్పుడు స్నేహితులుగా పలకరించుకోవచ్చ'ని రాసింది. దానికి శేఖరం జవాబు రాయలేదు. జవాబు రాయలేదని అమూల్య వూరుకోలేదు. వెంటవెంట అతనికి ఉత్తరాలు రాయటం మొదలు పెట్టింది. వాటిల్లో జీవితంపట్ల తనకున్న అభిలాష, కోర్కెలు, అన్నీ వివరిస్తూ శేఖరంలో తనకు కావలసిన వాటిల్లో ఏంవున్నాయో, ఏంలేవో వివరిస్తూ రాసేది. ఉత్తరాలు చాలా సహజంగా– న్యాయంగా ప్లెయిన్‌గా

వుండేవి. వాటిల్లో వేటినీ శేఖరం కాదనలేకపోయేవాడు. ఆఖరి ఉత్తరంలో రాసింది అమూల్య. 'నీలో నేను మొదట చూసినవి యిప్పటికీ వున్నాయి. వాటిని నేను ఎక్కడున్నా యే సమయంలో గూడా గౌరవించి అభిమానిస్తాను. కానీ నాకు ముఖ్యంగా కావాల్సినవి నీలో లేవు. అవి వున్నాయని నన్ను నేను మోసపుచ్చుకోలేను. ఒకవేళ అలా మోసపుచ్చుకుందామని అనుకుంటే జరిగే ఫలితం నాకు తెలుసు. అందుకే నేనటువైపు వెళ్ళటంలేదు. నాలో లేనివి ఏవో నీకు గూడా తెలుసు. నాకు కావల్సిన విధంగా మారమని నిన్నెలా అడగనో- అలాగే నీకు కావల్సిన విధంగా నేనూ మారలేను. యిలాగయితే ప్రపంచంలో ఎన్ని వివాహాలు జయప్రదం అవుతాయా అని నువ్వడిగితే నేను జవాబు చెప్పలేను. మనలో నూటికి తొంభై జీవితాలు త్యాగమనే చక్రంలో ఆకుల్లా తిరిగిపోతున్నాయి. చాలామందికి అసలు జీవితం అంటే ఏమిటీ, దాన్నెలా అనుభవించాలి అన్న ప్రశ్న లేకుండా బ్రతుకుతున్నారు. అలాటి వాళ్ళకి చెయ్యెత్తి సమస్కరించవచ్చు. వాళ్ళకే బాధలూ వుండవు. కానీ నేనలాటిదాన్ని కాను. నాకు ప్రత్యేకంగా కావల్సినవి కొన్ని వున్నాయి. అవి అందకపోతే పోయినాయి. కానీ వాటికోసం నేను ప్రయత్నం చెయ్యకుండా వుండలేను. ప్రసాద్‌ని నేను చేసుకుంటున్నానంటే అతనేదో మహా పొడిచేశాడని- ధీరుడని- అందరికీ అతీతుడని గాదు. ఒకవిధకంగా అతను నీకంటే చాలా తక్కువే. కానీ నీలా అతను జీవితాన్ని నా యిష్టంవచ్చినట్లు అనుభవించటానికి అడ్డురాడు. నేనంటే పిచ్చియిష్టం. అంతవరకే తెలుసు

అతనికి. అదెంత హాయి! నీలా అతను తన ప్రేమతో బంధించాలనిగాని— ఆ ప్రవాహంలో ముంచాలనిగాని చూడడు. శుక్రవారం మేం యిద్దరం న్యూయార్క్‌కి బైలుదేరుతున్నాం. నాకు తెలియని లోకాలకు ఎగరటానికి ప్రసాద్ నాకు రెక్కలు యిస్తున్నాడు. అంతే— అక్కడన్నుంచి తిరిగి వస్తానని నమ్మకం లేదు. ఒకవేళ తిరిగి వచ్చినా మనిద్దరం కలుసుకుంటాం అనే ప్రసక్తి లేదు. జీవితంలో మన పరిచయానికి గతమేగాని భవిష్యత్ లేకపోవచ్చు. నన్ను క్షమించు! నాకు తెలుసు నువ్వు కోరుకున్న విధంగా నేనుండ లేకపోయానని. అందుకు నేను దిగులు పడటంలేదు. సెలవు!" చాలా వివరంగా రాసిన ఆ ఉత్తరాన్ని చాలా కాలం దగ్గర పెట్టుకున్నాడు శేఖరం. అమూల్య అమెరికా వెళ్ళిపోయింది. తనకు ఉద్యోగం దొరికింది. ఆంధ్రప్రదేశ్ రాకముందే హైద్రాబాదు వచ్చేశాడు. తన సంస్కృతికి తన స్వజనానికి సంబంధంలేని నగరం. అనవసరంగా సానుభూతి చూపేవాళ్ళుగాని, జీవితంలో ఓడిపోయానని వెక్కిరించేవాళ్ళుగాని, అమూల్యముందు చాతకానివాడవైనావని గుర్తుచేసేవాళ్ళుగాని లేరు. మనసు, మనసుతోపాటు జీవిత విధానాన్ని గూడా మార్చుకుని హైద్రాబాద్‌లో సెటిల్ అయ్యాడు శేఖరం. ఇప్పుడెవ్వరికీ అతనికి పెళ్ళయినట్లు తెలియదు. మళ్ళీ పెళ్ళిచేసుకోమని సలహా యిస్తున్న మిత్రుల్ని తిరస్కరించేవాడు. ఇన్ని విధాలావున్న అతనికి ఆడవాళ్ళంటే విముఖత్వం యెందుకో యెవరికీ అర్థం అయేదిగాదు. మళ్ళీ ఆడవాళ్ళతో అతని ప్రవర్తన చాలా మృదువుగా, ఆకర్ష

ణీయంగా వుండేది. మళ్ళీ పెళ్ళిచేసుకోగలనని శేఖరం కల్లో గూడా అనుకోలేదు.

తర్వాత చాలా కాలానికి వోసారి ఓ స్నేహితుడు పెళ్ళిచూపులకు తోడు రమ్మనమని బందరు దగ్గిర ఓ పల్లెటూరికి తీసుకెళ్ళాడు. ఆ పెళ్ళికూతురే వాసంతి. చాలా శ్రోత్రియ కుటుంబంలో పుట్టిన వాసంతికి పుట్టిన వూరుతప్ప ప్రపంచం తెలియదు. పుట్టుకతో వచ్చిన విజ్ఞానంతప్ప పుస్తకాల ప్రభావం లేదు. అడవిమల్లెలావున్న వాసంతి అమాయకపు మొహంతో – పసిపిల్ల మనస్తత్వాన్ని ప్రతిబింబింపచేసే పెద్ద పెద్ద కళ్ళతో, తలయెత్తలేని సిగ్గుతో శేఖరాన్ని మొదటి చూపులోనే ఆకర్షించింది. 'పేరేమిటని' అడుగుతున్న శేఖరమే పెళ్ళికొడుకనుకున్న వాసంతి కళ్ళల్లో మెరుపులు కురిపిస్తూ 'వాసంతి' అంది. ఆ అమ్మాయి ఏం చదువుకోలేదని, పైనుంచి వాళ్ళు తన హోదాకి తగినవారు కాదని ఆ సంబంధాన్ని తోసిపారేశాడు శేఖరం మిత్రుడు. తర్వాత తనే స్వయంగా యీ సంగతి తెలియపరుస్తూ,తనకున్నవి తెలియపరుస్తూ మీకేమీ అభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని నేను చేసుకుంటానని వుత్తరం రాశాడు.

తిరుగు టపాలో వుత్తరానికి బదులు పిల్లతండ్రి పరుగెత్తుకొచ్చాడు. తన మొదటి వివాహాన్ని గురించి స్థూలంగా వివరిస్తూ, ఆ అమ్మాయి పోయిందని, మళ్ళీ తనకు పెళ్ళిచేసుకోవాలనిపించలేదని యింత కాలానికి వాసంతి తన మనసులో ఆ కోర్కెని కదిపిందని చెప్పాడు. శేఖరం స్థితిగతులు తెలుసుకున్న ఆయన మొహం విప్పారింది. పెళ్ళిచూపులకు రావటం

కేవలం అమ్మాయి అదృష్టం అని పదే పదే చెప్పి కళ్ళలో నీళ్ళు తిరిగినంత సంతోషం పొందింది ఆయన తిరుగుముహం పట్టాడు. మరుసటి నెలలో వాసంతితో శేఖరం వివాహం జరిగిపోయింది.

వాసంతి రాకతో శేఖర్ జీవితమే మారిపోయింది. చాలాకాలంనుంచీ ఆధారంలేక అడ్డదిడ్డంగా పాకుతున్న మనసుకి పెద్ద ఆధారం దొరికినట్లయింది. కానీ యిదంతా వాసంతికి తెలియదు. సంభాషణలో మూడొంతులు వాసంతివే వుంటాయి. ఒక వంతులో సగం శేఖరం నవ్వుతూ వుంటాడు. జీవిత తటాకంలో ప్రశాంతతని పొందిన నీరు తేటగా తేరుకో సాగింది. పాత అనుభవాలు అడుక్కి వెళ్ళి పోయినాయి. పూర్తిగా ధైర్యం కలిగింది. అమ్మయ్య అనుకుంటున్న సమయంలో మళ్ళీ రాయి విసరబడింది. అమూల్యవచ్చింది. ఈసారి నీళ్ళు మలినం అయితే తేర్చటం తనకి సాధ్యంగాదు. అందుకే శేఖరం భయపడ్తున్నాడు. అతన్ని మరీ మరీ బాధిస్తున్న విషయం తనమీద అమూల్య ప్రభావం పూర్తిగా పోయిందనుకున్నాడు. కానీ అదేం లేదు. తాత్కాలికంగా ప్రక్కకుజరిగిపెరిగి వుంది. సమయం చిక్కగానే మళ్ళీ వురుకుతోంది మీదకి. అదీ బాధిస్తున్న విషయం.

చాలాసేపట్నుంచీ ఏవేవో చెప్తున్నాడు శేఖరం. అతని గుండెలమీద అలాగే పడుకుని వింటోంది వాసంతి. చెవిదగ్గర టకటకమని గడియారంలా కొట్టుకుంటున్న అతని గుండె - ఒక్కోసారి బాధగా, మరోసారి కోపంగా- యింకోసారి అతి

బాధగా రక రకాలుగా మారుతున్న కంఠస్వరం, గదిలో బెడ్‌లాంప్‌నుంచి లేత నీలంగా వస్తున్న కాంతి అదోరకంగా వుండి గదిలో వస్తువుల్ని తమాషాగాచేసి చూపుతోంది. యివన్నీ కలిసి వాసంతికి యిదంతా అబద్ధం, మాయ—శేఖరానికి వెనక యింత గాథ వుండటం ఏమిటి? పచ్చి అబద్ధం అన్పిస్తోంది, నిజంగానే కథలావుంది.

"నిజం వసూ ! నా కిప్పుడు తేలికనిపిస్తోంది. నిజంగా నేనింత బాధపడవలసిందిగాని, భయపడవలసిందిగాని లేదేమో కదూ ! యేమిటి నిద్రపోతున్నావా? ఒక్క—మాట గూడా మాట్లాడ లేదు యింతసేపట్నుంచీ– చెప్పు!–" భుజాలుపట్టి లేవదీస్తూ అన్నాడు శేఖరం.

"లేదు, లేదు. మీరు చెప్తున్న కథ వింటున్నాను." నీరసంగా మళ్ళీ అతని గుండెలమీదికి తల వాలుస్తూ అంది వాసంతి. శేఖరం మాట్లాడ లేదు. తను తొందరపడ్డాడేమో! వాసంతిది అర్థం అవుతుందా ? చెప్పకుండావుంటే బాగుండేదేమో. అతని చేతులు వాసంతి జుట్టును— బుగ్గల్ని అప్యాయంగా నిముకుతూ వుండిపోయాయి. మనసు హఠాత్తుగా— వేగంగా ఆలోచించసాగింది. లేదు, లేదు. తనమీద అమూల్య ప్రభావానికిబలమేలేదు. వసంతి తన ప్రక్క—నుంది. వాసంతితో జీవితం ముడిపడిపోయివుంది. వాసంతికోసం తను కాని — అమూల్యంకోసం కాదు. లోకంలోని యితరులలో అమూల్య ఒకటి.

అమూల్య వచ్చి యెదురుగా కూర్చున్నా తను చలించడు. అవును నిజం! అమూల్యకి తనంటే ఏమిటో యింకా

బాగా తెలియాలి. వాసంతితో కలిసి ప్రస్తుతం తను అనుభవిస్తున్న జీవితాన్ని చూసి యీర్ష్యపడాలి. తనని గురించి ఆలోచించేందుకు ఒక్క సెకనుకూడా ఖాళీకాకుండా వాసంతి ఆక్రమించుకుందని తెలియాలి. తను అనవసరంగా ఖంగారు పడుతున్నాడు. యిది మంచికే వచ్చింది. ఒకవేళ యెప్పటికీ అమూల్య యిక్కడే వుండిపోవటం తటస్థిస్తే తను యీ వూరునుంచి ట్రాన్సఫర్ చేయించుకుని వెళ్ళిపోతాడు. ట్రాన్సఫర్ కుదరదు, చెయ్యము అంటేనా వాసంతిని తీసుకుని యింకెక్కడికైనా వెళ్ళిపోతాడు. అంతేగాని అమూల్యని వాసంతి నీడగూడా తొక్కనివ్వడు. ఆలోచిస్తున్న అతను పరధ్యానంగా మరింత గుండెల దగ్గరికి లాక్కున్నాడు.

"నే నొకటి అడగనా?" చాలా సేపటికి మొదటిసారిగా మాట్లాడుతూ అతి నీరసంగా అంది వాసంతి.

"ఏమిటది చెప్పు! ఇహనుంచీ నీకు తెలియని విషయమంటూ లేదు."

"ఆమె తిరిగిరావటం మీ కేమన్నా అన్పిస్తోందా?"

"అంటే?" అర్థంగానట్లు వాసంతి కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"అంటే ఏంలేదు. నన్ను పెళ్ళిచేసుకోవటంలో త్వరపడ్డాననిపిస్తోందా మీకు? చెప్పండి! నేను వేరుగా-పరాయిగా అన్పించటం లేదుగదూ! యిన్నాళ్ళ మన జీవితం ఏం కాకుండా పోదుగా మీకు?"

"ఏమిటి నువ్వనేది?"

"మీరు పడేబాధ చూస్తూంటే ఆమెమీద మీకింకా అభిమానం వున్నట్లే వుంది. ఆవిడంటే లెక్కలేనట్లే వుంటే మీ రసలు బాధపడనే పడరు."

"నీ మొహం! అదేంకాదు, ప్రపంచంలో నా కున్నది ఒక్కరే, అది వాసంతి! ఆ వాసంతికీ, నాకూ మధ్య అడ్డుగా ఏదీరాదు. వాసంతి తనంత తాను నన్నక్కర్లేదంటే తప్ప. నువ్వు చాలా అలిసిపోయావు. యిహ పడుకో! నీ కస లిది చెప్పి వుండకూడదు. నే వొట్టి మూర్ఖుణ్ణి! చూడు, నీ మొహంలో యిందాకటి చిరునవ్వు లేదు. కళ్ళుగూడా అనుమానంగా భయంగా వున్నాయి. నువ్వు నన్ను నమ్మకపోతే నేనేం చెయ్యలేను వాసంతీ! ఆవిడ నాకేంకాదు. ప్రపంచంలో వున్న లక్షమందిలో ఆవిడ ఒకత్తి. నువ్వు అనవసరమైన ఆలోచన్లతో మనసు పాడుచేసుకోనని నాకు మాటయివ్వాలి. నీ ఆరోగ్యం అసలే సరిగ్గా లేదు. ఈ రెండురోజుల్లో చాలా తీసినట్లు కన్పిస్తున్నావు. డాక్టర్ సుశీల వచ్చిందా? ఏమంది?" వాసంతి చేతుల్ని తన బుగ్గలికి, కళ్ళకి ఆన్చుకుంటూ అడిగాడు శేఖరం. ఆఖరిమాటకి వాసంతి మొహంలోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. 'యెలా చెప్పటం అతనికి? ఇప్పుడా - యిలాగా— ఊహుఁ కాదు, యిప్పుడు కాదు' అనుకుంటూ "రేపు మీరు ఫోన్ చేసి అడగండి!" అంది.

"అదేం! నీకు చెప్పలేదూ?"

"చెప్పలేదు" అంది వాసంతి నిర్లిప్తంగా.

తెల్లవారుఝామైంది. చల్లటిగాలి కిటికీలోంచి దూసు

కొస్తోంది. బాగా అలిసిపోయిన యిద్దరూ నిద్రకు ప్రయత్నం చేయసాగారు.

మర్నాడు వాసంతి లేచేసరికి బాగా బారెడు పొద్దెక్కింది. తెల్లగా బాగా మెరుస్తున్న యెండ కిటికీ చువ్వల్ని దూసుకొచ్చి లోపల డ్రాయరు కుర్చీ, పుస్తకాలు వాటి మీద పడ్తోంది. మంచంమీద బద్ధకంగా బరువుగా కళ్ళు తెరిచిన వాసంతికి అంతా కలలో ఏవో పెద్దగొడవ జరిగి తను స్పృహ తప్పిపోయినట్లు అన్పించింది క్షణంసేపు. రాత్రి జరిగింది, శేఖరం చెప్పింది అంతా వట్టి కలేన నిపించింది. ప్రక్కకు తిరిగిచూసింది. కానీ శేఖరం లేడు. వళ్ళంతా బరువుగా, బాధగావుంది. జ్వరం తగిలిందని థర్మామీటర్ చూపింది.

వాసంతి లేచి యివతలకు వచ్చేసరికి శేఖరం హాల్లో కూర్చుని కాఫీ తాగుతూ పేపరు చూసుకుంటున్నాడు. మామూలు ప్రకారం అతని స్నానం అయిపోయింది. వాసంతి మెల్లగావచ్చి శేఖరం కుర్చీప్రక్కన నిలబడింది. "మెలకువ వచ్చిందా? కళ్ళు చాలా యెర్రగా వున్నాయి. యింకొంచెం సేపు పడుకోకబోయావా? నిద్రచాల్లేదులా వుందికదూ?" నవ్వుతూ చెయ్యి తీసుకొని ఏదో చెప్పబోతున్నాడు శేఖరం. హఠాత్తుగా వాసంతి వంగి మోకాళ్ళమీద కూర్చుని అతని చేతుల్లో మొహం ధాచుకుని ఏడుస్తూ "రాత్రి చెప్పిందంతా అబద్ధంకదూ! అబద్ధం అని చెప్పండి నాకు! నాకేదో భయం వేస్తోంది" అంది.

శేఖరం క్షణంసేపు మాట్లాడలేదు. తర్వాత చాలా తగ్గుస్థాయిలో చాలా నిశ్చలంగా, నెమ్మదిగా "అవును, అంతా

అబద్ధమే- నీకు కల్పించి చెప్పానులే! రాజూవాళ్ళు వస్తారు. వెళ్ళి మొహం కడుక్కొని రా..యిదేమిటి! వేడిగా వుందేం వళ్ళు? జ్వరం వచ్చిందా?" హఠాత్తుగా, ఆదుర్దాగా చేయిపట్టి లేవ దీస్తూ అన్నాడు.

వాసంతికి జ్వరం బాగానే వచ్చింది. డాక్టర్ సుశీలకి ఫోన్ చేశాడు. ఆవిడ డ్యూటీమీద వుంది - సాయంత్రం గానీ రాలేనని యెవరిచేతో చెప్పించింది. ఆరోజు శేఖరం ఆఫీసు మానేశాడు. వాసంతి ప్రక్కనే కూర్చుని చాలా మామూలుగా అవీ యివీ చెప్తూ తమాషాలు చెప్పి నవ్విస్తూ కూర్చున్నాడు. వాసంతిని విడిచి కనీసం ముందు హాల్లోకి కూడా వెళ్ళలేదు. యిష్టంలేకపోయినా శేఖరంకోసం చారూ అన్నం తింది వాసంతి.

బాగా పన్నెండయింది. తన మంచంప్రక్కన వాలు కుర్చీలో కూర్చుని యేదో పుస్తకం తిరగవేసుకున్న శేఖ రాన్ని వున్నట్లుండి అడిగింది. "ఆవిడ సుకన్యాదేవికి తప్ప యిక్కడ యింకెవ్వరికీ తెలియదా ?" అని. "తెలియదు, నువ్వింక ఆ ప్రసంగం యెత్తొద్దు!" గంభీరంగా అన్నాడు శేఖరం పుస్తకం తిరగవేస్తూ.

వాసంతి ఆ పైన మాట్లాడలేదు. శీతాకాలపు మధ్యాహ్నంపన్నెండు గంటలు దాట్తూండగానే యెండ తిరిగి పోతోంది. సన్నగా వీస్తున్న గాలికి గుమ్మానికున్న కర్టెన్ కదులుతోంది. గదిలో గోడమీద పాకిన వాటర్ప్లాంట్ ఆకుల్ని కిటికీలోంచి వచ్చిన పిచ్చుక ఒకటి పొడిచి తుంపాలని ప్రయత్నం చేస్తోంది. మధ్యాహ్నం చాలా దిగులుగా యేదో

పోగొట్టుకున్న దానిలా వుంది. మోచేయి దిండుమీద ఆన్చి పడుకుని చేతిలో పుస్తకాన్ని తిరగేస్తోంది వాసంతి. యేదో చప్పున అయిపోయి, జరగవలసిందేదో జరిగిపోతే బాగుండు ననిపిస్తోంది. నాటకంలో సీను సీనుకీ మధ్య యింటర్వెల్‌లా వుంది. ఇంతలో ఫోన్ మోగింది. 'సుశీల' అంటూ శేఖరం లేచి వెళ్ళి రిసీవర్ తీశాడు. అంతవరకూ పుస్తకం తిరగేస్తున్న వాసంతి కళ్ళెత్తి అతని మొహంలో మారబోయే భావాలకోసం పరీక్షగా చూస్తోంది. సుశీల చెప్పబోయే దేమిటో వాసంతికి తెలుసు. కానీ యిప్పు డీ సమయంలో— యిలా – సుశీల చెప్పకుండా వుంటే బాగుండు. అసలు యింకెవరయినా అయితే బాగుండుననిపిస్తోంది.

"హలో !" అన్నాడు శేఖరం రిసీవర్ తీసుకుని.

"… …" అవతలనుంచి యే స్వరం విన్పించిందో, యేమని విన్పించిందో తెలియదు. కానీ హఠాత్తుగా శేఖరం మొహంలో గబగబా రంగులు మారాయి. కంఠస్వరంగూడా మారింది. ఫోన్ వైర్‌ని చేత్తో సాఫ్‌చేస్తూ చాలా గంభీరంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. "ఇందులో క్షమార్పణ ఏమీ లేదండి! రాత్రి నా ప్రవర్తనకి నేనే చెప్పుకోవాలి. యేదయినా ముందుగా కొంచం యేమాత్రం తెలిసినా అలాటి సంఘటన జరిగేదికాదు. అందులో మీకు తెలియని రహస్యం యేంలేదు."

"… …"మళ్ళా అవతలనుంచి యేదో విన్పించింది.

"అబ్బెబ్బె ! మీ మీద కోపం యెందుకు ? యేమిటీ ?

మాట్లాడాలంటోందా ? క్షమించండి! మా యిద్దరికీ గతమే తప్ప భవిష్యత్తు లేదన్నానని చెప్పండి! యెప్పుడూ యెలాటి పరిస్థితుల్లోనూ మా మధ్య మాట్లాడవలసిన మాటలేంలేవు. ముందు నా యీ ప్రశ్నకు జవాబు చెప్పండి! ప్రసాద్‌కి క్కడికి ట్రాన్స్‌ఫర్ అయిందా!...ఓహో ! అలాగా ! నేను ఒకవేళ ట్రాన్స్‌ఫర్ అయిందేమో అనుకుంటున్నాను. ఇందులో మీ దగ్గర దాచవలసిందేమీ లేదు. ఒకవేళ వాళ్ళు వుద్యోగరీత్యా యిక్కడికి వచ్చినట్లయితే నేను రేపే ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోదాం అనుకుంటున్నాను. మేం యిద్దరం ఒక వూళ్లోవుంటూ తెలియకుండా వుండటం అసంభవం."

"...... ... ..."

"ప్రస్తుతం వాసంతికి తెలియనివిషయం అంటూ ఏమీ లేదండీ! నిన్నరాత్రివరకూ తెలియదు. కానీ మీ యింటి దగ్గర్నుంచి వచ్చింతర్వాత అంతా చెప్పేశాను. ఇప్పుడు నాకు చాలా తేలికగావుంది" నిట్టూర్పు విడుస్తూ అన్నాడు శేఖరం. మంచంమీద కూర్చున్న వాసంతి రెప్పవాల్చటంగూడా మర్చిపోయి తదేకంగా భర్తని గమనిస్తోంది.

"లేదండీ ! మీరు గట్టిగా చెప్పండి ! మాకు కలుసుకోవాల్సింది గాని, మాట్లాడుకోవాల్సింది గాని యేమీ లేదని. నేను వుంటాను. అవును, ఆఫీసుకు వెళ్ళలేదు. వాసంతికి ఒంట్లో బాగాలేదు" ఫోన్ చప్పుడుచేస్తూ పెట్టేశాడు శేఖరం. అంతవరకూ శేఖరంవంక పరీక్షగా చూస్తున్న వాసంతి చప్పున తలతిప్పుకుని కిటికీలోంచి బైటకు చూస్తున్నదానిలా కూర్చుండిపోయింది.

తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్న శేఖరం చాలాసేపటి వరకూ ఏం మాట్లాడలేదు. పుస్తకం తిరిగేస్తూ ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. వాసంతికూడా ఏం మాట్లాడలేదు. నాలుగు దాటిపోయింది. రాజు కాఫీ తెచ్చి యిస్తుండగా శేఖరం అన్నాడు. "ఇదుగో చూడు రాజూ! దబ్బున ఏదయినా టిఫెన్ చెయ్యి, లేకపోతే బజారుపోయి ఏవైనా పళ్లు తీసుకురా! కాఫీచేసి ఫ్లాస్కులో పోసివుంచు- మేం అలా డ్రైవ్ కి పోతున్నాం. తిరిగివచ్చేసరికి కొంత ఆలస్యం అవుతుందేమో!" రాజు సరేనని తలూపి వెళ్ళిపోయాడు. వాసంతి వైపు చూడకుండానే కాఫీ తాగుతూ "నువ్వు త్వరగా తయారుకావాలి వసూ! ఇలా యింట్లో కూర్చోవటం నాకు బాగాలేదు. అలా హిమాయిత్ సాగర్ పోదాం- రాజుని క్యారియర్ తో భోజనంకూడా పెట్టమంటాను కారులో. ఈ రాత్రికి తిరిగి రావద్దు. నువ్వు కొంచెం మొహం కడుక్కుని బట్టలేసుకో!" శేఖరం మాటలు సాంతం పూర్తికాకమునుపే టెలిఫోన్ మోగింది. కాఫీతాగుతున్న శేఖరం ప్రశ్నార్థకంగా ఫోన్ వైపు చూశాడు. కాఫీ తాగటం మానేసిన వాసంతి శేఖర్ మొహంలోకి చూడసాగింది.

కాఫీ తాగడం పూర్తిచేసి నిదానంగా లేచి వెళ్ళి రిసీవర్ తీసుకొన్నాడు "హల్లో!" అంటూ.

వాసంతి చేతిలో కప్పు అలాగే బట్టుకుని భర్తమొహంలోకి మళ్ళీ రెప్పవాల్చకుండా చూడసాగింది.

"యెవరు?" కొంచెం కటువుగానే అడిగాడు శేఖరం.

"... ... ... ... ..."

"ఓ డాక్టర్ సుశీలా! నమస్తే, నమస్తే! అయిందా డ్యూటీ?" శేఖరం మొహం ప్రసన్నమైంది. అంతవరకూ చూస్తున్న వాసంతి చప్పున దృష్టిఅంతా కాఫీమీదకు మరల్చుకుని జాగ్రత్తగా తాగుతున్నట్లు తాగసాగింది. 'యిప్పుడా యిప్పుడా—' వాసంతి గుండెలు కొట్టుకుంటున్నాయి.

"ఏమిటీ! బహుమతా? బహుమతేమిటీ? అహఁ వాసంతి నాకేం చెప్పలేదే!" వెనక్కితిరిగి వాసంతివైపు చూస్తూ అన్నాడు. అప్పటికే కాఫీ తాగడం పూర్తిచేసిన వాసంతి కప్పు వంగి క్రిందనున్న స్టూలుమీద పెట్టేసి పుస్తకంలోకి తల దూర్చుకొని బొమ్మలు చూడసాగింది.

"అడగమంటారా? ఆగండి అయితే—"హఠాత్ పీస్‌ని అరచేత్తో మూసి "సుశీల తనకి బహుమతి రావాలంటోం దేమిటి వసూ! దేనికీ?" అన్నాడు.

"యేమో నాకు తెలియదు. ఆవిడనే అడగండి!"రక్తం అంతా ఒక్కసారి మొహంలోకి వచ్చేసినట్లున్న యెర్రబడిన మొహాన్ని మరింత దించేసుకుంది వాసంతి.

"మిమ్మల్నే అడగమంటోంది" మళ్ళీ ఫోన్‌లో మాట్లాడూ అన్నాడు శేఖరం.

"అఁ! ఏమిటీ?సరిగ్గా వినపడటంలేదు.ఊఁ, ఏమిటి మీరనేది? నిజం! సుశీల చెప్తోంది నిజమేనా వసూ!" వెనక్కి తిరిగి అడిగాడు శేఖరం. పుస్తకంలోకి మొహం దించేసుకుంది జవాబుగా వాసంతి.

"థ్యాంక్స్ సుశీలా! మీకు స్పెషల్ పార్టీ యిస్తానని ప్రామిస్ చేస్తున్నాను. నేను వుంటాను" ఫోన్ పెట్టేశాడు శేఖరం.

ఫోన్ పెట్టేసిన శేఖరం వెంటనే పరుగెత్తుకుని దగ్గరకు వచ్చెయ్యలేదు. క్షణంసేపు అలాగే నిలబడిపోయి భార్యని చూసి ఆ తర్వాత నెమ్మదిగా వచ్చి మంచంమీద ప్రక్కగా కూర్చున్నాడు.

"నిజమా వసూ! నా కింతవరకూ చెప్పలేదేం?" తన భుజం చుట్టూ చెయ్యివేసి అడుగుతున్న శేఖర్ మాటలు వింటూనే వాసంతి చప్పున పుస్తకం వదిలి అతని ఒళ్లో తల దాచుకుంటూ "రాగానే చెప్పాలను కున్నాను. కానీ టైమ్ దొరకలేదు, అందులో యీ గొడవలో అస లెలా చెప్పాలో తెలియలేదు."

"నా కోసం నువ్వింత మంచివార్త దాచుకొనివుంటే నేను నిన్నెంతో బాధించానుకదూ! క్షమించు వాసంతీ!" యేదో అనబోతున్న శేఖరాన్ని చేత్తో వారిస్తూ "ముందు నా కిది చెప్పండి! మీ కెలా అన్పిస్తోంది? సంతోషంగా లేదూ!"

"దానికి జవాబు కావాలంటే నువ్వు తలెత్తి కళ్ళు తెరిచి నా మొహంలోకి చూడాలి." అదో రకంగా మారిపోయిన కంఠస్వరంతో అంటున్న భర్త కేసి తలతిప్పి కళ్ళు తెరిచి చూడబోతున్న వాసంతి చెంపల మీద అప్పటికే నిండిపోయి జారిన కన్నీటి బిందువులు పడ్డాయి. వాటిని కొనగోటితో తుడుస్తూ శేఖరం "ఇంతకంటే మంచివార్త యింకేముంటుంది నాకు? మనలో చాలా సంసారాలు నూటికి

దాదాపు తొంభై, పిల్లల మూలంగానే నిలుస్తున్నాయి అంటే అతిశయోక్తిలేదు వసూ! మన సంసారం అలాటిది కాకపోయినా..." వంగి వాసంతి నుదురుమీద ముద్దుపెట్టుకుంటూ అన్నాడు.

బాగా సాయంత్రం అయిపోయింది. శేఖరం, వాసంతి తయారయినారు. గేరేజ్‌లోంచి కారుని బైటకుతీసి వరండా ముందుకు తేవటానికి వెళ్ళాడు శేఖరం. హాల్లో శేఖరంకోసం చూస్తూ నిలబడిన వాసంతికి ఫ్లాస్క్, పళ్ళు, భోజనం క్యారియర్ కారులో పెట్టి తిరిగివస్తున్న రాజు 'సుకన్యాదేవి నౌకరు వచ్చి యిచ్చి వెళ్ళా'డంటూ ఒక కవరు యిచ్చివెళ్ళాడు. కవరు అంటించి వుంది. పైన శేఖరం పేరు వుంది. ఇంతలో వాకిట్లోంచి శేఖరం పిలుపు విన్పించింది. వచ్చి కారులో ప్రక్కన కూర్చుంటూ రాజు యిచ్చిన కవరు ఇచ్చింది. "యేమిటిది?" కారు స్టార్ట్ చేయబోతున్న శేఖరం ఆగి కవరు చించాడు. అందులో వుత్తరం వుంది. చదువుకున్న శేఖరం పూర్తిచేసి చదవమన్నట్లుగా వాసంతి చేతికిచ్చాడు. "యెవరు రాసింది?" ఉత్తరంతీసుకునిచూసింది వాసంతి. అది అమూల్య స్వయంగా రాసింది ఉత్తరం. అందులో యిలా వుంది—

"శేఖరం!

నిన్ను వదిలిపెట్టి వెడ్తున్నప్పుడు నేను చాలా అదృష్టవంతురాలినని, నిన్ను గెల్చానని అనుకున్నాను. కానీ నేను వెళ్తోంది అదృష్టపు శిఖరాలు అందుకోవటానికి కాదని—అఖాతపు లోయల్లో నామ రూపాలు లేకుండా జారిపోవటానికని నాకేం తెలుసు! నువ్వెప్పుడూ అదృష్టవంతుడివే! మొదట

నన్ను పెళ్ళి చేసుకున్నప్పుడు లోకం నిన్ను అదృష్టవంతుడివని అంది. నేను విడిచి వెళ్ళిపోయినప్పుడూ అంది. యిప్పుడూ అంటోంది. ఈ కొద్ది సంవత్సరాల్లో నేను మానసికంగా చాలా మారాను. కొన్ని వ్యూహాల తాలూకు విలువలు గూడా అర్థమైనాయి. అనుభవం చాలా పాఠాలు నేర్పింది. నిన్ను విడిచిపెట్టినప్పుడు వెళ్ళిన అమూల్యని కాను నేను. అందుకే యిప్పుడు యిలా హఠాత్తుగా వెడ్తున్నాను. నువ్వు హైద్రాబాద్‌లో వున్నావని తెలిస్తే నే నీ ఛాయలకి గూడా వచ్చేదాన్ని కాదు. తెలియక పాతజీవితాన్ని జ్ఞప్తిచేసుకుని కాసేపు కులాసాగా గడుపుదామని సుకన్యాదేవి యింటికి వెళ్లాను. సరిగ్గా అప్పుడే పుట్టినరోజు జరగటం, మీరు రావటం నా దురదృష్టం. రాత్రి చాలా బాధపడ్డాను. ముఖ్యంగా వాసంతి మొహం నన్ను నిద్రపోనివ్వలేదు. నాకు ప్రస్తుతం లేనివి — నేను అజ్ఞానంలో కాలదన్నుకున్నవి యిప్పుడు వాసంతికి ఉన్నాయి. ఒక్కసారి నీతో మాట్లాడాలని ప్రయత్నించి సుకన్యాదేవి చేత ఫోన్ చేయించాను. గతంతప్ప భవిష్యత్తు లేదన్న నా మాటని నాకు తిప్పిచెప్పావు. నీకేం భయమక్కర్లేదు. నువ్వే ట్రాన్స్‌ఫర్‌కీ ప్రయత్నం చెయ్యొద్దు. నేనే యీ రోజు సాయంత్రం వెళ్ళిపోతున్నాను, మళ్ళీ యెప్పటికీ కనపడనని వాగ్దానం చేస్తూ.

—అమూల్య"

అమూల్య చేవుత్తరాన్ని ఒకటికి రెండు సార్లు చదివింది వాసంతి. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అవి అమూల్య వెళ్ళిపోతోందికదా అనే సానుభూతితో కాదు.

యేదో పెద్దప్రమాదం జరగబోయి ఆగిపోయిందనే సంతృప్తితో, సంతోషంతో, యెప్పటిలా తనూ, శేఖరం మిగిలిపోయారు కదా అనే ధైర్యంతో. చేత్తో ఉత్తరాన్ని మడిచేసి బైటకు చూసింది వాసంతి. కారు హిమాయిత్ సాగర్ వైపు రివ్వున దూసుకుపోతోంది. ప్రక్కనుంచి బంజారా హిల్స్ వెనక్కు భయంతో తప్పుకుంటున్నాయి.

రోడ్డుని తదేకంగా చూస్తూ ఫాస్ట్‌గా డ్రైవ్ చేస్తున్న శేఖరం ఒకచేత్తో డ్రైవ్ చేస్తూ, రెండో చేయిజాపి వాసంతిని దగ్గరకు తీసుకున్నాడు. అతని కళ్ళల్లో గూడా నీళ్ళు తిరుగుతున్నాయని, అవి నిగ్రహించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడని వాసంతికి తెలియదు. ప్రక్కకు తిరిగి భర్త భుజం మీద తలదాచుకుంటూ "నిన్న యీ టైమ్‌కి,యీరోజు యీ టైమ్‌కి యెంత అనుభవంపొందాను నేను!ఒక్క ఇరవై నాలుగు గంటలలో యెంత మారానో !" అంది.

"ఒక్కోసారి అంతే వసూ! ఇరవైనాలుగు గంటలే అక్కర్లేదు. ఇరవైనాలుగు సెకన్లుచాలు మారటానికి!" నెమ్మదిగా అన్నాడు శేఖరం.

...—...